సాక్షి
ఏలూరు
గురువారం । 26 । జూన్ । 2025



'ఎస్' వెనుక ఎవరు?

నూజివీడు నియోజకవర్గంలోని మద్యం బెల్టుషాపులకు మద్యం సిండికేట్ సరఫరా చేస్తున్న మద్యం సీసాలపై 'ఎస్' స్టిక్కర్ ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 8లో



ఇంకా వెలగని 'దీపం'

అట్టహాసంగా ప్రారంభించిన దీపం పథకం ఫలితం నీరుగారుతోంది. సుమారు రెండు నెలలైనా దీపం-2 రెండో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. 8లో



జయహో జగన్నాథా

జగన్నాథ రథోత్సవాలను శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథుని ఆలయంలో ఈనెల 27 నుంచి నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. 8లో

చివరికి దక్కని ధర

- ఖరీఫ్ ప్రారంభమైనా ఖాతాల్లో పడని రబీ సొమ్ములు
- జిల్లాలో 2,400 మంది రైతులకు రూ.40 కోట్ల మేర బకాయి
- మే 9 తరువాత కొన్న ధాన్యానికి జమకాని నగదు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: నెలన్నర క్రితం రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలు ఇంకా రైతు ఖాతాల్లో పడలేదు. ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభం కావడం, పనులు ముమ్మరం అవుతున్న తరుణంలో రబీ డబ్బులు లేక పెట్టుబడులకు అప్పులబాట పట్టాల్సిన పరిస్థితి. కొనుగోలు చేసిన ధాన్యాన్నికి 24 గంటల్లో నగదు జమ చేస్తామని చేసిన ప్రకటన, మంత్రుల సమీక్షలు అంతా ప్రచార ఆర్భాటాలకే పరిమితం తప్ప క్షేత్ర స్థాయిలో అమలుకాలేదు. జిల్లాలో 2400 మంది రైతులకు రబీ సీజన్‌కు సంబంధించి రూ.40 కోట్ల మేర నగదు చెల్లించాల్సి ఉంది.

మాటల్లో తప్ప చేతల్లో శూన్యం

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణం అధికంగా ఉంటుంది. గత రబీ సీజన్‌లో 77,466 ఎకరాల్లో వరి సాగు జరగగా 3.53 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.90 లక్షల ఎకరాల్లో సాగు జరగనుంది. ఈ క్రమంలో గత రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని రైతు నచ్చిన మిల్లుకు ధాన్యాన్ని తోలుకుని విక్రయించుకోవచ్చని, ఎలాంటి ఆంక్షలు ఉండవని, 24 గంటల వ్యవధిలోనే నగదును ఖాతాలో జమ చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, స్థానిక ప్రజాప్రతినిధులు హడావుడి చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కొనుగోళ్లు ప్రారంభించి మే నెలాఖరుకు ముగించారు. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 3.53 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా ప్రభుత్వం 50 శాతం మేర కొనుగోలు చేస్తామని ప్రకటించి 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ణయించారు. ఆ తరువాత రైతులు అడుగుతున్నారని 1.80 లక్షలకు, ఆ తరువాత 2 లక్షలకు, ఆ తరువాత 2.50 లక్షలకు టార్గెట్‌ను పెంచారు. 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలో కొనుగోలు చేస్తామని మే మొదటి వారంలో ప్రకటించారు.

బకాయిలు వాస్తవమే



ఆరుగాలం శ్రమించి **పంట చేతికొ**చ్చిన తరు**వాత** పంటను **అమ్ముకుని** ఆ **సొమ్మును మ**రో పంట **పెట్టుబడి కోస**ం వాడేందుకు ఎదురుచూస్తున్న **రైతులకు కూట**మి ప్రభుత్వం నిరాశ మిగిల్చింది. **ఒక దెం**దులూరులోనే రూ.10 లక్షలకు **పైగా నగదు** రైతులకు బ్యాంకు ఖాతాలకు **జమ అవ్వలే**దు. వస్తాయని నేటికి రైతులు **ఆశగా ఎదురు**చూస్తున్నారు. వెంటనే బకాయిలు బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి.

– కొలుసు గణపతిరావు, రైతు, దెందులూరు కో–ఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్

రూ.40 కోట్ల బకాయి

మే 9కి ముందు వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు జమ చేశారు. జిల్లాలో 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీని విలువ రూ.590 కోట్లు కాగా రైతులకు రూ.550 కోట్లు మాత్రమే చెల్లించారు. అది కూడా 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి చెల్లించి 2400 మంది రైతులకు రూ.49 కోట్ల వరకు మే 10 నుంచి బకాయిలు ఉండిపోయాయి. దీనిపై అనేకమార్లు విన్నవించినా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా స్పందన శూన్యం. నిధుల కొరతని, సాంకేతిక కారణాలని ఇలా అనేక రకరకాల సాకుతో నెలన్నరగా నగదు చెల్లింపులు నిలిపివేశారు.

సూర్యఘర్ యోజనపై సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలో పీఎం సూర్య ఘర్ కింద సోలార్ ప్యానల్ యూనిట్ల రిజిస్ట్రేషన్లు, స్థాపన ప్రక్రియను వేగవంతం చేసి మంచి ప్రగతిని సాధించాలని కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో సూర్య ఘర్ యోజన పథకంపై విద్యుత్తు శాఖ అధికారులు, బ్యాంకర్లు, సోలార్ కంపెనీలు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 5 లక్షలు కుటుంబాలు ఉండగా కనీసం లక్ష దరఖాస్తులు రావాలని, 70 వేలు లక్ష్యం కాగా ఇంతవరకు 52 వేలు దరఖాస్తులు అందాయన్నారు. లక్ష్యం మేరకు సాగకపోవడంపై కారణాలను సమీక్షించారు. సూర్య ఘర్ పథకం లక్ష్యాలను సాధించాలన్నారు. సమావేశంలో విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు పి.సాల్మన్‌రాజు, లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి, ఈఈ ఎ.రాధాకృష్ణ, డీఈ నోడల్ అధికారి ఏ.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు నేడు, రేపు కౌన్సెలింగ్

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న బీ.ఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మిగిలిన ఇంటర్మీడియట్ సీట్ల అడ్మిషన్ కోసం ఈ నెల 26, 27 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారిణి బి.ఉమాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు ఈ నెల 26న వట్లూరు గురుకులంలో, 27న బాలురకు పెదవేగి గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు



తగరం రాంబాబు



ముల్లంగి వేణురెడ్డి

బుట్టాయగూడెం/చింతలపూడి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగం ఆర్‌టీఐ వింగ్ సెక్రటరీగా జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంకు చెందిన తగరం రాంబాబు నియమితులయ్యారు. అలాగే పార్టీ రాష్ట్ర ఐటీ వింగ్ కార్యదర్శిగా లింగపాలెం మండలం ముడిచర్ల గ్రామానికి చెందిన ముల్లంగి వేణురెడ్డిని నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వేణురెడ్డి ప్రస్తుతం రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. తమను రాష్ట్రస్థాయి పదవుల్లో నియమించినందుకు వీరిద్దరూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు 541 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో బుధవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు మొత్తం 541 మంది హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం పరీక్షలకు 100 మందికి 88 మంది హాజరు కాగా, మధ్యాహ్నం సెషన్‌లో 100 మందికి 97 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 200 మందికి 179 మంది హాజరు కాగా, మధ్యాహ్నం సెషన్‌లో 199 మందికి గాను 177 మంది హాజరయ్యారు.

వెలిగిన వీధి లైట్లు



చెరువు వీధిలో వెలుగుతున్న లైట్లు

సాక్షి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల: 'చెరువు వీధిలో చిమ్మ చీకట్లు' శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. వీధిలైట్ల విద్యుత్ సరఫరాలో ఏర్పడిన లోపాన్ని సరిచేశారు. దాంతో వీధిలైట్లు పూర్తి స్థాయిలో వెలిగాయి. ఈ క్రమంలో డ్రైనేజీలను శుభ్రం చేసే పనులను కూడా ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పలు డ్రెయిన్లను శుభ్రం చేశారు.







పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సమన్వయకర్త జయప్రకాష్

మర్యాద పూర్వక భేటీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగింది. అనంతరం ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత పరిస్థితులపై చర్చించామని డీఎన్నార్ తెలిపారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ కూడా పార్టీ అధినేత జగన్‌ను కలిశారు.

– కైకలూరు/దెందులూరు/ఏలూరుటౌన్

డయల్ 112 సేవలు వేగవంతం



ఏలూరు నగరంలో హైటెక్ బుల్లెట్స్ ర్యాలీలో ఎస్పీ శివకిషోర్, సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో అసాంఘిక శక్తుల ఆట కట్టించటం.. డయల్ 112 సేవలు మరింత వేగవంతం చేయడం.. ట్రాఫిక్ నియంత్రణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన హైటెక్ బుల్లెట్ వాహనాలను జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ బుధవారం ప్రారంభించారు. ప్రజలకు ఈ వాహనాలపై అవగాహన కల్పించేందుకు ఎస్పీ స్వయంగా బుల్లెట్ నడుపుతూ.. నగరంలో సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు. ట్రాఫిక్ పరిస్థితులు స్వయంగా పరిశీలించటంతోపాటు, ఆధునిక బుల్లెట్ వాహనాల పనితీరు ప్రజలకు తెలియజేసేందుకు కొద్దిసేపు నగర వీధుల్లో పర్యటించారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీటీసీ డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ ఉత్పత్తులకు మంచి గుర్తింపు



ఢాకాలో అంతర్జాతీయ టెక్స్‌టైల్స్ ఎగ్జిబిషన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్ : భారతీయ ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు పెరుగుతున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తోందని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరుగుతున్న అంతర్జాతీయ టెక్స్‌టైల్స్ ఎగ్జిబిషన్‌లో ఇండియన్ స్టాల్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టెక్స్‌టైల్స్ అభివృద్ధి కోసం ఇండియా అనేక చర్యలు తీసుకుంటోందని, బంగ్లాదేశ్ ఇండియా పరస్పర సహకారం ఈ రంగాన్ని బలోపేతం చేస్తుందని, దానికి ఇరుదేశాల మధ్య సహకార సంబంధాలు బలోపేతం కావాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రవళి స్పిన్నర్స్ డైరెక్టర్ సింహాద్రి రవళి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ఒక యువతికి మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఏలూరు వెంకటాపురం పంచాయతీ మారుతీనగర్‌కు చెందిన కల్లాపల్లి గురుమూర్తి ఏలూరులోని లాడ్జికి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈనెల 15న మరోసారి మైనర్ బాలికను తన బంధువుల ఇంటికి తీసుకువెళ్ళిన గురుమూర్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు బుధవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెన్షన్ నిబంధనల సవరణ సరికాదు

భీమవరం : పెన్షన్ నిబంధనల సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు కోరారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ద్వారా పెన్షనర్లను గ్రూపులుగా విభజించే అధికారం తన చేతిల్లోకి తీసుకుంటుందన్నారు. వేతన సవరణ సంఘం సిఫార్సులను పాత పెన్షనర్లకు వర్తింప చేయకుండా, కొత్తగా రిటైరయ్యే వారికి మాత్రమే వర్తింపజేసే అధికారం కలిగి ఉంటుందన్నారు.

ఇంకా వెలగని 'దీపం'

- రెండు నెలలైనా అందని గ్యాస్ సబ్సిడీ
- రెండో విడత సుమారు రూ.19.81 కోట్ల బకాయిలు



దెందులూరు: ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన దీపం పథకం ఫలితం నీరుగారుతోంది. సుమారు రెండు నెలలైనా దీపం-2 రెండో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. తొలి విడతలో ఈ పథకం ద్వారా అరకొరగా నగదు విడుదల చేశారు. రెండో విడత పూర్తిగా విస్మరించారు. 2024 నవంబర్‌లో దీపం-2 పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం 2025 మార్చి 31 వరకు స్కీంను అమలు చేసింది. మొదటి విడత కొంతవరకు నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. రెండో విడత 2025 ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. రెండు నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో పైసా కూడా జమ కాలేదు.

జిల్లాలో అన్ని గ్యాస్ కంపెనీలకు సంబంధించి 55 ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో సింగిల్, డబుల్ సిలిండర్ల కనెక్షన్లు కలిపి 6,92,825 ఉన్నాయి. మొదటి విడత జిల్లా వ్యాప్తంగా 4,40,278 మంది లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. 4,35,035 కనెక్షన్లకు మాత్రమే నగదు బ్యాంకు ఖాతాల్లో జమైంది. రూ.49,78,950 బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరుకు వరకు రెండో విడత గడువు నిర్ణయించారు. దీనికి సంబంధించిన నిధులు ఇంతవరకూ అందలేదు. రెండో విడతకు సంబంధించి రెండు నెలలుగా ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో సుమారుగా 1,77,040 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. వారు ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలకు డబ్బులు చెల్లించారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

దీపం పథకం సిలిండర్ నగదు అందలేదని చాలా మంది లబ్ధిదారులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. అయితే వారి నగదుకి సంబంధించిన సమాచారం లేకపోవడం, గ్యాస్ కంపెనీలు తమ వద్ద ప్రభుత్వ నగదు లేదని స్పష్టం చేయడంతో ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారు.

ఏం సమాధానం చెబుతారు



మహిళలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు ఏం సమాధానం చెబుతారు. ఎన్నికల ముందు నాది హామీ అంటూ అన్ని ప్రచార సభల్లో హామీలిచ్చారు. ఇప్పుడు వంట గ్యాస్ విషయంలో కూడా మోసం చేస్తే ఎలా?

– నిట్టా లీలా నవకాంతం, జెడ్పీటీసీ దెందులూరు

సూపర్ సిక్స్ అమలు చేస్తారా?



కూటమి ప్రభుత్వానికి సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా? అన్ని వర్గాల ప్రజలు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తారని ఎదురుచూస్తున్నారు. సంవత్సరం పూర్తయింది. గ్యాస్ కాకుండా ఉచిత బస్సు.. ఆడబిడ్డ నిధి ఎప్పుడు అమలు చేస్తారు.

– అప్పన పద్మావతి, వైస్ ఎంపీపీ, పెదపాడు

ప్రజల్లో తీవ్ర అసంతృప్తి



ఎన్నికల ముందు అన్ని ప్రచార సభల్లో సూపర్ సిక్స్ పేరిట హామీలిచ్చారు. సంవత్సరం గడిచినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి మహిళలకు ఎంతో ఉపయోగపడే పథకాలు. అమలు చేయనప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారు?

– పర్వతనేని శ్రావణి, సర్పంచ్, రామారావుగూడెం

సబ్సిడీ జమ చేస్తున్నాం



3.30 లక్షల మంది లబ్ధిదారులు గ్యాస్ సబ్సిడీ కోసం ఆన్‌లైన్ చేశారు. సబ్సిడీ జమ కార్యక్రమం జరుగుతుంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. లబ్ధిదారుల ఖాతాల్లో సబ్సిడీ సొమ్ము త్వరలోనే జమ అవుతుంది.

– విలియమ్స్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, ఏలూరు

9 కిలోల గంజాయి పట్టివేత

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి నిందితుల నుంచి 9 కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, రూ.4,100 నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి సీఐ వి.కోటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామ పరిధిలోని ఏలూరు జాతీయ రహదారి-16 సర్వీస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నారని తెలియటంతో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో త్రీటౌన్ ఎస్సై రాంబాబు, సిబ్బంది చాకచక్యంగా దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్-1985 మేరకు కేసు నమోదు చేశామన్నారు. విలాసాలు, సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిందితులు గంజాయి విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. నిందితులు బాపట్ల జిల్లా అద్దంకి మండలం ప్రాంతానికి చెందిన సైద వేణు, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పాదర్తికి చెందిన సింబత్తుల సాయి, అదే గ్రామానికి చెందిన అలుగుల నాగవర్ధన్‌గా గుర్తించామని, వీరితోపాటు ఒక మైనర్ బాలుడు కూడా ఉన్నట్లు సీఐ చెప్పారు.

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పీపీ రోడ్డులోని ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపడం జరుగుతుందని తెలిపారు.

మా పాఠశాలను విలీనం చేయొద్దు సార్

భీమవరం అర్బన్: మా పాఠశాలను విలీనం చేయొద్దని దెయ్యాలతిప్పలోని ఎస్సీ పేటకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలక్టరేట్‌లోని డీఆర్‌వో మొగలి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఎస్సీ పేటలో ఉన్న పాఠశాలను బీసీ పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారులకు మొర పెట్టుకున్నారు. గతంలో బీసీ పేటలోని వ్యక్తులకు తమ పేటలోని వ్యక్తులకు గొడవలు అయ్యాయని, ఇప్పుడు విలీనం చేయడం వల్ల మళ్లీ గొడవలు జరిగే ప్రమాదం ఉందని వినతి పత్రంలో ఎస్సీ పేట వాసులు తెలిపారు. సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని డీఆర్‌వో హామీ ఇచ్చారు.

ఎంఈఓ విచారణ



విద్యార్థిని విచారిస్తున్న ఎంఈఓ ప్రసాద్

దెందులూరు: గోపన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో ఏవీఎస్‌వీ ప్రసాద్ బుధవారం విచారణ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు ఆటలాడుతుండగా ఒక విద్యార్థి వేలుకి గాయమైంది. దీనిపై సమాచారం అందిన ఎంఈవో ప్రసాద్ పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎటువంటి ఇబ్బంది లేదని ఎంఈఓ తెలిపారు. హెచ్ఎం డాక్టర్ ఎం మనోహర్, యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి మహేష్ యాదవ్, మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) తదితరులు ఉన్నారు.

జయహో జగన్నాథా



ఆలయం ముందు నిర్మించిన చలువ పందిరి



ముస్తాబైన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు

రేపటి నుంచి లక్ష్మీపురం ఆలయంలో జగన్నాథ రథోత్సవాలు

ద్వారకాతిరుమల: పూరి క్షేత్రంలో వలే జగన్నాథ రథోత్సవాలను శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథుని ఆలయంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 6 వరకు వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ స్వామివారు ఆలయ యాగశాలలో రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీన్ని పురస్కరించుకుని యాగశాల ప్రాంతాన్ని ముస్తాబు చేస్తున్నారు. అలాగే స్వామివారి రథయాత్రలకు వినియోగించే రథ వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయం ముందు చలువ పందిరిని నిర్మించారు. అదేవిధంగా ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో అలంకరించారు. ఉత్సవాల ప్రారంభం రోజు శుక్రవారం సాయంత్రం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు రథ వాహనంలో కొలువుదీరి ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళ్లనున్నారు. అలాగే వచ్చేనెల 6 న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురం వైపు రథయాత్ర సాగనుంది. ఉత్సవాలు జరిగే పదిరోజులు జగన్నాథుని దశావతారాలు భక్తులను అలరించనున్నాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తరించాలని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి కోరారు. ఉత్సవాల్లో భాగంగా రోజుకో ప్రత్యేక అలంకారంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు.



జగన్నాథుని రథం

ఆలయ విశిష్టత

ఈ ఆలయాన్ని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పూరీ వాస్తవ్యులు, మఠాధిపతులైన మంత్రరత్నం అమ్మాజీ అనే లక్ష్మీ అమ్మవారు 130 ఏళ్ల క్రితం నిర్మించారు. అందులో జగన్నాథునితో పాటు, వేంకటేశ్వర స్వామివారిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి కల్యాణోత్సవ, పవిత్రోత్సవాలతో కైంకర్యాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీవారి దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకున్న తరువాత జీర్ణోద్ధరణ గావించి మరింత అభివృద్ధి చేసింది. ఈ ఆలయంలో వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లతో పాటు జగన్నాథ స్వామి, బలరామస్వామి, సుభద్రాదేవుల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, శ్రీ సంతాన వేణుగోపాల స్వామి సన్నిధి ఉన్నాయి.

'ఎస్' వెనుక ఎవరు?

మద్యం సీసాలపై 'ఎస్' స్టిక్కర్‌పై సర్వత్రా చర్చ



'ఎస్' స్టిక్కర్ అంటించిన మద్యం సీసాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: నూజివీడు నియోజకవర్గంలోని మద్యం బెల్టుషాపులకు మద్యం సిండికేట్ సరఫరా చేస్తున్న మద్యం సీసాలపై 'ఎస్' స్టిక్కర్ ఉండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా సర్వత్రా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఊరూరా పదుల సంఖ్యలో బెల్టుషాపులు, మద్యం దుకాణాల వద్ద బార్‌లను తలపించేలా అనధికార సిట్టింగ్‌లతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. ఇష్టారాజ్యంగా సిట్టింగ్‌లతో మద్యం వ్యాపారం జోరుగా సాగుతున్నప్పటికీ అనధికార సిట్టింగ్‌ల వైపు ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం సిండికేట్ బెల్టుషాపులకు 'ఎస్' స్టిక్కర్‌తో మద్యం సీసాలను సరఫరా చేస్తుండటం తీవ్ర సంచలనంగా మారింది. ఈ స్టిక్కర్ అర్థం ఏమిటి, దీని వెనుక ఉన్నదెవరనే ప్రశ్నలు రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మద్యం షాపుల నుంచి బెల్టుషాపులకు మద్యం సీసాలు రవాణా అవుతుంటే స్టిక్కర్ వేయాల్సిన అవసరమేముందనే సందేహం ప్రతి ఒక్కరిలో వస్తోంది. అలా కాకుండా ఇంకేదైనా మద్యంను సరఫరా చేస్తున్నారా అనే అనుమానాలు ప్రబలడానికి ఆస్కారం ఏర్పడింది.

బెల్టుషాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.40 అధికం

ఏ గ్రామంలోనైనా బెల్టుషాపు పెట్టాలంటే రూ.25 వేలు చెల్లించాల్సిందే. బెల్టుషాపులకు అనుమతి లేదని, ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలని ప్రభుత్వం ప్రకటనలు ఇస్తుంటే ఇక్కడ మాత్రం ఒక్కో సీసాపై రూ.20 నుంచి రూ.40 అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మద్యం సిండికేట్ బెల్టుషాపులకు ఏ మద్యం బ్రాండ్ అయినా సరే ఒక్కో సీసాపై ఎమ్మార్పీపై అదనంగా రూ.20కు విక్రయిస్తుండగా బెల్టుషాపుల నిర్వాహకులు మరో రూ.20 వేసుకొని మందుబాబులకు అమ్ముతున్నారు. దీంతో ఒక్కో సీసాకు ఎమ్మార్పీ కంటే రూ.40 అదనంగా చెల్లించి మందుబాబులు మద్యంను సేవించాల్సి వస్తోంది. పెద్ద ఎత్తున అధిక ధరలకు విక్రయిస్తూ ఇంత దారుణంగా దోపిడీ చేస్తుంటే పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అప్పుడప్పుడు దాడులు చేస్తూ బెల్టుషాపుల నిర్వహణకు అనుమతి లేదంటూ ప్రకటనలు ఇచ్చి మిన్నకుండిపోతున్నారు.

అతివేగంతో నిండు ప్రాణం బలి

- ఆటోను ఢీకొన్న లారీ
- ఒక వ్యక్తి మృతి, మరో ముగ్గురికి గాయాలు

ముదినేపల్లి రూరల్: లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా ఒక నిండు ప్రాణం బలైంది. ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కొరగుంటపాలెం శివారు రాజానగరం వద్ద బుధవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం కోరుకొల్లు వైపు నుంచి సింగరాయపాలెం వస్తున్న ఆటోలో ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారు. రాజానగరం సమీపంలోకి ఆటో రాగానే భీమవరం వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడగా ప్రయాణికుడు అల్లూరు వద్ద సంక వెంకటేశ్వరరావు(69) లారీ టైర్ల కింద పడి ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. ఆటోలోని మరో ముగ్గురు ప్రయాణికులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేశ్వరరావు కుమారుడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఏలూరు శాయ్ ఇన్‌చార్జి అరెస్ట్

లైంగిక వేధింపుల ఆరోపణపై పోక్సో కేసు నమోదు

ఏలూరు టౌన్: లైంగిక వేధింపుల కేసులో ఏలూరు శాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇన్‌చార్జిని ఏలూరు టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం ఏలూరు శాయ్ ఆధ్వర్యంలోని స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న దూలం నాగేంద్ర వెంకట వినాయక ప్రసాద్ శిక్షణ పొందుతోన్న బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడున్నారంటూ బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో టూటౌన్ ఎస్సై కళ్యాణి పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరు శాయ్‌లోని 10మంది బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన అభియోగంపై ఇప్పటికే బెంగుళూరు శాయ్ బృందం విచారణ చేపట్టగా.. ఏలూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్పీ కేపీ శివకిషోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్ కుమార్, మహిళా ఎస్సై కళ్యాణి గాలింపు చర్యలు చేపట్టి మంగళవారం రాత్రి వినాయక ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిని బుధవారం పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు.

మావుళ్లమ్మకు ఉయ్యాల సేవ



అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠమాస జాతర మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు బుధవారం అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించారు. పుట్టింటి, అత్తింటి వారు అల్లూరి, మెంటే వంశస్తులచే ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ఈ కార్యక్రమాన్ని జరిపారు. అలాగే అమావాస్య సందర్భంగా మావుళ్లమ్మ దేవస్థానంలో చండీహోమం నిర్వహించారు. ఈ హోమంలో 60 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

– భీమవరం (ప్రకాశం చౌక్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సూరాబత్తుల సాయిబాబు మృతదేహం

భీమడోలు: సూరప్పగూడెంలోని పాత సుగర్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సూరాబత్తుల సాయిబాబు (30) పాత షుగర్స్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 24వ తేదీన ఫ్యాక్టరీలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల షిఫ్ట్‌లో పని చేసేందుకు వెళ్లాడు. అయితే రాత్రి 10 గంటలకు షిఫ్ట్ దిగవలసి ఉండగా రిలీవర్‌కు అతను కనిపించలేదు. ఫ్యాక్టరీలో ఉన్న చెరువు పక్కన దుస్తులు కనిపించడంతో అతని కోసం చెర్వులో వెతకగా బుధవారం అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి చిరంజీవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. కాగా మనస్పర్థల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో సాయిబాబు మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు చెబుతున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ఉంగుటూరు: చేబ్రోలు-బాదంపూడి రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై అప్పారావు తెలిపారు. మృతురాలి వయస్సు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతురాలు కుడి చేతిపై తమ్ముడు అను పచ్చబొట్టు కలిగి ఉందని తెలిపారు. వివరాలు తెలిస్తే 94906 17090, 99480 10061 నంబర్లలో సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం మార్చురీకి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

గ్యాస్ నొప్పితో మహిళ మృతి



విజయలక్ష్మి భౌతిక కాయాన్ని పరిశీలిస్తున్న దేశిరెడ్డి

చాట్రాయి: గ్యాస్ నొప్పితో ఓ మహిళ మృతి చెందింది. పోతనపల్లికి చెందిన వడిత్యా కామాక్షి (35) బుధవారం గ్యాస్ నొప్పిగా ఉందని భర్తతో కలిసి చాట్రాయి ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించారు. టిఫిన్ చేసి రావాలని ఆర్ఎంపీ వైద్యుడు సూచించారు. అనంతరం టిఫిన్ చేసి వచ్చిన తరువాత బీపీ చూస్తుండగా ఆమె అకస్మాత్తుగా వాంతులు చేసుకుని స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె మృతితో భర్త, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. విజయలక్ష్మి భౌతికకాయాన్ని దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కారంగుల వాసు సందర్శించి నివాళులర్పించారు.